సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 5 । డిసెంబర్ । 2024



వెయ్యేళ్ల కాలిబాట!

అదివో.. అల్లదివో అంటూ .. పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు తిరుమల ఏడు కొండలను ఎక్కిన కాలిబాట అది. -8లో



ప్రశాంతంగా రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికలు

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.380	రూ.460
రెండోరకం	రూ.300	రూ.376



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 151 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	550	550
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 167.480 కిలోలు

న్యూస్‌రీల్

6న జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలు

రాయచోటి అర్బన్: జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలను ఈనెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ అజయ్ కుమార్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు డైట్ కళాశాలలో ఉదయం 10 గంటలకు జరుగుతాయన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులంతా పాల్గొనవచ్చునన్నారు. కేంద్ర,రాష్ట్ర బోర్డులకు అనుబంధ పాఠశాలల విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. గత ఏడాది కళా ఉత్సవ్ విజేతలు ఇందులో పాల్గొనేందుకు అవకాశం లేదన్నారు. ఆసక్తి గల విద్యార్థులు గానకళ, వాద్య సంగీతం, నృత్యం, నాటకకళ, దృశ్యకళలు, సంప్రదాయ కథా విన్యాసం విభాగాల్లో పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదన్నారు. మరిన్ని వివరాలకు డైట్ అధ్యాపకులు అసదుల్లా (9440084715), శ్రీదేవి (9441228359)లను సంప్రదించాలని కోరారు.

కడప మీదుగా కొట్టాయంకు ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం కడపమీదుగా కొట్టాయంకు ప్రత్యేక రైలును నడపనున్నారని కడప రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. 07151 నెంబరుగల రైలు జనవరి 2, 9, 16, 23వ తేదీలలో కాచిగూడ నుంచి కొట్టాయంకు నడుస్తుందన్నారు. 07152 నెంబరుగల రైలు కొట్టాయం నుంచి కాచిగూడకు జనవరి 3, 10, 17, 24 తేదీలలో నడుస్తుందన్నారు. ఈ రైలు కాచిగూడ, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తిరోడ్డు, గద్వాల్, కర్నూలు, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, ఈరోడ్, తిరు పూర్, కోయంబత్తూరు, పాలక్కడ్, త్రిశూర్, ఎర్నాకులం మీదుగా కొట్టాయం చేరుతుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రా నాయక్

గాలివీడు: రైతులందరూ వారు సాగుచేసిన ప్రతి పంటకు ఇ- క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పందికుంట పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి రైతు రబీ సీజన్లో సాగుచేసిన ప్రతి పంటకు ఇ-క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. వేరుశనగ, టమాటా పంటలకు డిసెంబర్ 15 తేదీలోగా, వరి పంటకు డిసెంబర్ 30వ తేదీలోగా క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలియజేశారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కొద్దిరోజులు వరికోతలు నిలుపుదల చేయాలని రైతులకు సూచించారు.కార్యక్రమంలో జేడీ ఆఫీస్ టెక్నికల్ ఏవో వెంకటమోహన్, లక్కిరెడ్డిపల్లి సహాయ సంచాలకులు జయరాణి,మండల వ్యవసాయ అధికారి గౌతమి, ఏఈఓ అపర్ణ పందికుంట రైతులు పాల్గొన్నారు.


వదలని వాన

- జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షం
- మంగంపేట మైనింగ్ ప్రాంతంలోకి చేరిన వర్షపు నీరు
- ఎడతెరిపి లేకుండా కురుస్తుండడంతో స్తంభించిన జనజీవనం

సాక్షి రాయచోటి: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా పడుతుండడంతో జనజీవనం స్తంభించిపోయింది. కొన్నిచోట్ల జల్లులు పడుతుండగా, మరికొన్నిచోట్ల కుండపోత వర్షం కురుస్తోంది. వరుసపెట్టి తుపాన్లు వస్తుండడంతో వర్షం జిల్లాను వీడడం లేదు. ఇప్పటికే నాలుగు రోజులుగా పడుతున్న వర్షాలతో వరితోపాటు ఇతర పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రైల్వేకోడూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు అదరగొట్టడంతో పిడుగులు పడిన ప్రమాదం తప్పింది.

మంగంపేట మైనింగ్ ప్రాంతంలో వర్షపు నీరు

జిల్లాలోని రైల్వేకోడూరు ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నాలుగు రోజుల వ్యవధిలోనే రెండుమార్లు శేషాచలం అడవుల నుంచి నీళ్లు జలపాతంలా వచ్చి కడప-రేణిగుంట జాతీయ రహదారిపై ప్రవహించాయి. అంతేకాకుండా పంటలకు నష్టం వాటిల్లింది. కాలనీల్లోకి నీరు చేరిన పరిస్థితులు ఉన్నాయి. ఓబులవారిపల్లె మండలం మంగంపేట మైనింగ్ గనిలోకి పెద్ద సంఖ్యలో వరద నీరు చేరింది. ఒకప్రక్క పెద్దపెద్ద మోటార్ల ద్వారా నీటిని బయటికి తోడుతున్నా మరోప్రక్క నిన్ను వీడను నేను అంటూ వర్షం పడుతుండడంతో మళ్లీ వర్షపు నీరు చేరుతోంది. దీంతో గనిలో ఇబ్బందులు తప్పడం లేదు.



ఒంటిమిట్ట రామాలయంపై కురుస్తున్న వర్షం

రాజంపేట నియోజకవర్గంలో భారీ వర్షం

అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలో భారీ వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం కుమ్మరించడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఒంటమిట్ట ఆలయ సమీప ప్రాంతంలోని రోడ్డుపై నీరు వచ్చి చేరింది. పంట పొలాల్లోకి వర్షపునీరు నిలబడింది. భారీ వర్షంతో జనజీవనం కొద్దిసేపు స్తంభించింది. రాజంపేటతోపాటు మదనపల్లె, రాయచోటి, రైల్వేకోడూరులలో కూడా కొద్దిసేపు తుంపెర వర్షం, మరికొద్దిసేపు మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం నుంచి కూడా ఆకాశం మేఘావృతమై ఉండి జల్లులు ఏకధాటిగా పడుతూనే ఉన్నాయి.



శేషాచల అడవుల నుండి కొర్లకుంట చెరువులోకి సాగుతున్న రెడ్డికాలువ



పింఛా వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన రెడ్డివారిపల్లెకు వెళ్లే రోడ్డు

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి



రాయచోటి: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో బ్యాంకు ప్రధాన కార్యాలయం తరలింపు తగదని శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఏపీజీబీ రైతులకు, మధ్యతరగతి ఖాతాదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. కరువు పీడిత వెనుకబడిన ప్రాంతమైన కడపలో బ్యాంకు ఉనికి ప్రాంతీయ అభివృద్ధికి కీలకంగా మారిందన్నారు. దేశవ్యాప్తంగా 193 ప్రాంతీయ, గ్రామీణ బ్యాంకులు ఉండేవన్నారు. 2006లో కేంద్ర ప్రభుత్వం వాటిని 43గా కుదించిందన్నారు. అంతకుముందు రాయలసీమ గ్రామీణ బ్యాంకు, అనంత గ్రామీణ బ్యాంకు, పినాకిని గ్రామీణ బ్యాంకులు ఐదు జిల్లాలకు సంబంధించి ఉండేవని పేర్కొన్నారు. వీటిలో రాయలసీమ గ్రామీణ బ్యాంకుకు కడప కేంద్రంగా ఈ బ్యాంకు ఉండేదని తెలిపారు. ఎక్కువ టర్నోవర్ ఉండటంతో ఆ ప్రాతిపదికన ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుగా మార్చి కడపలో ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేశారన్నారు. దేశంలో ఉన్న 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో నంబర్ వన్ స్థానంలో ఏపీజీబీ ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు. 552 శాఖలతో రూ. 50 వేల కోట్ల టర్నవర్, రూ. 802 కోట్ల లాభాలు, రూ..4591 కోట్ల రిజర్వ్‌తో వ్యాపారాభివృద్ధిలో మిగతా గ్రామీణ బ్యాంకులకన్నా అగ్రభాగాన ఉందన్నారు. ఇప్పుడు 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను 28 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులుగా కుదిస్తుండడంలో భాగంగా కడపలో ఉన్న ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించాలన్న ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రాయలసీమ ప్రాంతంలో ఉన్న హైకోర్టు, లా యూనివర్సిటీ, ఎంఎస్‌ఎంఈ కేంద్రం గతంలో అనంతపురానికి రావాల్సిన ఎయిమ్స్‌ను ఇతర ప్రాంతాలకు తరలించి రాయలసీమకు అన్యాయం చేశారన్నారు. ఈ ఒరవడిని ఇలా కొనసాగించవద్దని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. 2006లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కడపలోని ఏపీజీబీ ప్రధాన కార్యాలయానికి 50 సెంట్ల స్థలాన్ని కూడా కేటాయింపు చేశారని గుర్తు చేశారు. 2015లో కడప నగరంలోని మరియాపురం వద్ద అన్ని సౌకర్యాలతో భవనాన్ని రూ. 15 కోట్లతో నిర్మించారన్నారు. మిగిలిన ప్రాంతీయ బ్యాంకులకు సొంత భవనాలు కూడా లేవన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ బ్యాంకులకు స్పాన్సర్ బ్యాంకుగా కెనరా బ్యాంకు ఉండడం, ఆ కెనరా బ్యాంక్ హెడ్ ఆఫీసు బెంగుళూరులో ఉండడం కూడా కడపకు అడ్వాంటేజ్‌గా ఉంటుందన్నారు. ఈ విషయాలన్నింటినీ ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని విలీనం తరువాత ఏర్పడబోయే రాష్ట్ర స్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేయాలని శ్రీకాంత్ రెడ్డి కోరారు.

రాజంపేట ఏజీపీగా మౌనిక



మౌనిక

రాజంపేట: రాజంపేట అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా పచ్చా మౌనిక నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈమె ఎల్‌ఎల్‌బీ విద్యను కడప బసవతారకం న్యాయకళాశాలలో పూర్తి చేశారు. రాజంపేట బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ఉంటూ ప్రాక్టీస్ చేశారు. సీనియర్ న్యాయవాది హనుమంతనాయుడు కుమార్తె మౌనిక ఏజీపీగా ఎంపిక కావడం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తంచేశారు.

భూ సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, గ్రామవార్డు సచివాలయ సిబ్బందితో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈనెల 6నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. ఒక రెవెన్యూ గ్రామంలో రెండు గ్రామ పంచాయతీలు ఉంటే రెండు సభలను నిర్వహించేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి మండలానికి ఒక జిల్లా అధికారిని ప్రత్యేక నోడల్ అధికారిగా నియమించామని తెలిపారు. అనంతరం వివిధ అంశాలపై ఆయన అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై ప్రభుత్వశాఖలకు నోటీసులు

8 శాఖలకు జారీచేసిన తహసీల్దార్

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ప్రభుత్వశాఖలకు భూములు కేటాయించిన రెవెన్యూశాఖే బుధవారం నోటీసులు జారీ చేసింది. మీ ఆధీనంలోని భూమి మీకు ఎలా వచ్చింది, వాటి ఆధారాలను వారంలోపు తమకు సమర్పించాలని తహశీల్దార్ నోటీసులు జారీ చేశారు. హార్సిలీహిల్స్‌పై చిత్తూరుజిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి 78 సెంట్లు, పోలీసు అవుట్ పోస్టు, పోస్టాఫీసు, పోలీసు క్వార్టర్స్‌కు 93 సెంట్లు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు 54 సెంట్లు, పోలీసు అతిథిగృహానికి 17 సెంట్లు, బీఎస్ఎన్ఎల్‌కు 62 సెంట్లు, ఆయుర్వేద కేంద్రానికి 11 సెంట్లు, క్రీడాశాఖకు 3.90 ఎకరాలు, ఈద్గా 20 సెంట్లలో ఉన్నట్టు రికార్డుల్లో నమోదైంది. ఇప్పుడీ భూమి పైశాఖలకు ఎలా వచ్చింది, ఎప్పుడు కేటాయించారు అన్న వివరాలను రెవెన్యూ అధికారులు కోరుతున్నారు. పై శాఖలు, ఈద్గాకు చెందిన వారికి బుధవారం నోటిసులను అందజేశారు. వారంలోగా నోటీసులకు సమాధానం చెప్పాలని అందులో పేర్కొన్నారు. నోటీసుల జారీ విషయం తెలుసుకున్న ఆయా శాఖల అధికారులు రికార్డులు వెతికే పనిలో పడ్డారు. నోటీసులు జారీ చేసిన శాఖల్లో క్రీడాశాఖకు కేటాయించిన భూమిలో శిక్షణా కేంద్రం ఏర్పాటుకు గత టీడీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టి నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం పనులు ఆగిపోయాయి.



హార్సిలీహిల్స్‌పై బ్రిటీష్ హయాంలో నిర్మించిన పోలీస్‌స్టేషన్

- హార్సిలీహిల్స్‌పై భూమి కేటాయింపు మొదలైంది స్వాతంత్ర్యం వచ్చాకే. సముద్రమట్టానికి 1,256.53 మీటర్ల (4,141అడుగులు) ఎత్తులోని ఈ కొండపై ఉన్న రిజర్వ్‌ఫారెస్ట్ నుంచి 103 ఎకరాల భూమిని అటవీశాఖ 1959 జూలై 25న రెవెన్యూశాఖకు అప్పగించింది. బ్రిటీష్ పాలనలో కొండపై పోలీసు స్టేషన్ భవనం, ఎస్ఐ, సిబ్బంది నివాసానికి గృహాలను నిర్మించారని 1973లో హార్సిలీహిల్స్‌పై కానిస్టేబుల్‌గా పనిచేసి ఎస్ఐగా రిటైర్ అయిన నాగిరెడ్డి చెప్పారు. అంటే రెవెన్యూకు సెంటు భూమి లేని రోజుల్లోనే ఇవి నిర్మితమయ్యాని అర్థమవుతోంది.

రెవెన్యూ ఆస్తికే నోటీసు

1992లో బీఎస్ఎన్ఎల్ సంస్థ హార్సిలీహిల్స్‌పై టవర్, టెలిఫోన్ ఆపరేటింగ్ కేంద్రం ఏర్పాటుకు సర్వేనంబర్ 571/2లో 62 సెంట్ల భూమిని కేటాయించారు. నిరర్థక ఆస్తులను టెలికాం సంస్థ లీజుకు అప్పగించే చర్యల్లో భాగంగా మదనపల్లెకు చెందిన వీఎస్ఆర్ సంస్థకు 24 సెంట్లను తొమ్మిదేళ్లకు లీజుకు ఇచ్చింది. దీనిపై 2022 మే 24న కలెక్టర్ పీఎస్.గిరీషా బీఎస్ఎన్ఎల్‌కు రెవెన్యూశాఖ కేటాయించిన భూమిని రద్దు చేసి స్వాధీనం చేసుకున్నారు. తర్వాత ఇదే సంస్థకు టౌన్‌షిప్ కమిటి లీజుకు ఇచ్చింది. రెవెన్యూ ఆధీనంలోని లీజు ఆస్తికి నోటీసు ఇచ్చారు. కాగా ఉమ్మడి రాష్ట్రంలో హార్సిలీహిల్స్‌కు కనీస గుర్తింపు, ప్రాధాన్యత దక్కలేదు. విభజన తర్వాత కూడా ఇదే పరిస్థితి. జిల్లాల విభజనతో హార్సిలీహిల్స్‌పై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారించింది.

ఉపాధ్యాయులపై మరో భారం

- డిసెంబర్ 7లోగా ప్రోగ్రెస్ కార్డులు సిద్ధం చేయాలి
- ఆన్‌లైన్‌లో నమోదు చేసిన మార్కులకు భిన్నంగా కొత్త పద్ధతి
- పరీక్షల వేళ విద్యా బోధనకు ఆటంకాలు



సమగ్ర ప్రగతి కార్డులు ఉపాధ్యాయులకు అందజేస్తున్న మండలవిద్యాశాఖ అధికారులు


మదనపల్లె సిటీ: ఉపాధ్యాయులపై ఎటువంటి ఒత్తిళ్లు ఉండవని, బోధనకే పరిమితం చేస్తామని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చాక నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తోంది. పరీక్షల వేళ విద్యా బోధనకు దూరం చేసేలా రాష్ట్రవిద్యాశాఖ ఉపాధ్యాయులపై మరో భారం మోపింది. విద్యార్థులకు సంబంధించి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల పేరిట ప్రవేశపెట్టనున్న సమగ్ర ప్రగతి కార్డులను డిసెంబర్ 7వ తేదీనాటికి పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఎనిమిది పేజీలతో ఉన్న ఈ కార్డులో విద్యార్థికి సంబంధించిన రోల్ నంబర్,ఆధార్, అపార్ నంబర్లతో పాటు తల్లిదండ్రుల పూర్తి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. విద్యార్థి ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను సైతం కార్డులో పొందుపరచాల్సి ఉంటుంది.

ఒక్కో విద్యార్థికి అర గంట సమయం

జిల్లాలో ప్రాథమిక 1734, ప్రాథమికోన్నత పాఠశాలలు 162, ఉన్నత పాఠశాలలు 304 ఉన్నాయి. ఇందులో 1,54,784 మంది విద్యార్థులున్నారు. సమగ్ర ప్రగతి పత్రం కార్డులను ఆయా మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలలకు మంగళవారం పంపిణీ చేశారు. ఇప్పటి వరకు విద్యార్థికి సంబంధించిన ప్రోగెస్ కార్డు, అసెస్‌మెంట్స్ తదితర వివరాలకు సంబంధించి ఒక్కొక్కదానికి పది మార్కులకు నమోదు చేయించారు. మిగిలిన 20 మార్కులు పరీక్షల్లో విద్యార్థి చూపిన ప్రతిభ ప్రకారం నింపాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో, పాఠశాల రికార్డుల్లో ఇలాగే నమోదు చేస్తూ వచ్చారు. తాజాగా కార్డుల్లో మాత్రం ఐదేసి మార్కులకు కుదించి పరీక్షల్లో ప్రతిభకు 35 మార్కులు కేటాయించటంతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ప్రతి విద్యార్థికి గతంలో కేటాయించిన మార్కుల్లో 50 శాతం కోత విధించి రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలాంటి వివరాలు నమోదు చేసేందుకు ఒక్కో విద్యార్థికి 30 నిమిషాలకు పైనే సమయం పడుతుంది. కార్డు నింపడం ఒక్క ఉపాధ్యాయుడితో జరిగే పనికాకపోవడంతో ఒక్కో తరగతికి ముగ్గురు, నలుగు ఉపాధ్యాయులు కలిసి వివరాలు నమోదు చేస్తున్నారు.

అపార్ అవస్థలు వీడకముందే

ఇప్పటికే అపార్ ప్రక్రియతో ఉపాధ్యాయులు ఎంతగానో ఇబ్బందులు పడ్డారు. వారి సమస్యను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ అధికారులు తాజాగా మరో పని అప్పగించడం పట్ల ఉపాధ్యాయవర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమౌతోంది. ఈనెల 7వతేదీ జరగనున్న తల్లిదండ్రుల మెగా సమావేశం నాటికి కార్డుల నమోదు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. . ఈనెలలోనే విద్యార్థులకు ఎస్‌ఏ-1 పరీక్షలు జరగనున్న నేపథ్యంలో బోధన జరగకుండా అధికారులు ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగిస్తుండటంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అక్టోబర్ నుంచి ఉపాధ్యాయులు బోధనకు దూరమయ్యారు. ఈ కారణంగా సిలబస్ కూడా పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.



ఉపాధ్యాయులకు సెలవులు లేనట్లే

పదో తరగతి బోధిస్తున్న ఉపాధ్యాయులకు సెలవులు లేనట్లే. మార్చి 15 నచచి పదో తరగతి పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం సంక్రాంతి సెలవుల్లో కూడా పదో తరగతి విద్యార్థులకు క్లాసులు నిర్వహించాలని ప్రణాళికలు రూపొందించింది. సంక్రాంతి సెలవులు మూడు రోజులు మాత్రమే ఇవ్వాలని నిశ్చయించినట్లు తెలుస్తోంది. దీని ప్రకారం ఆదివారాల్లో కూడా తరగతులు జరగనున్నాయి. ఇప్పటికే మౌఖిక ఆదేశాలు రాగా ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నాయి.

ప్రోగ్రెస్‌కార్డులు పూర్తి చేసి ఇవ్వాలి



హోలిస్టిక్ ప్రోగెస్ కార్డులు పూర్తి చేసి విద్యార్థులకు అందజేయాలి. తరగతి ఉపాధ్యాయుడు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. 7వతేదీన మెగా పేరెంట్స్ కమిటీ సమావేశం విజయవంతం చేయాలి.

-సుబ్రమణ్యం, జిల్లా విద్యాశాఖ అధికారి, అన్నమయ్య జిల్లా

క్లుప్తంగా

జ్వరంతో చిన్నారి మృతి


దేవాన్షి (ఫైల్)

పుల్లంపేట : పుల్లంపేట మండలం, చెర్లోపల్లి అరుంధతి వాడ గ్రామానికి చెందిన వెంకటేష్, సాయితేజశ్రీ దంపతుల కుమార్తె దేవాన్షి (15 నెలలు) బాలిక జ్వరంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత 15 రోజులుగా జ్వరంతో బాధపడుతున్న చిన్నారిని కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించగా రక్తంలో ఇన్ఫెక్షన్ ఉందని డాక్టర్ చికిత్స అందించినా జ్వరం తగ్గలేదు. దంతో రాజంపేటలోని ప్రైవేటు ఆసుపత్రిలో చూపించినా ఫలితం లేకపోవడంతో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న ముద్దుల కుమార్తె దేవాన్షి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

యువకుడి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ వరప్రసాద్

సంబేపల్లె : మండల పరిధిలోని రౌతుకుంట గ్రామం బాటవారిపల్లెకు చెందిన రాయదుర్గం రామాంజులు (24) అనే యువకుడు ఉరి వేసుకొని మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. బాటవారిపల్లెకు చెందిన రామకృష్ణ కుమారుడు రామాంజులు ఇటీవల తండ్రి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలోనే చిన్నమండెం- సంబేపల్లె సరిహద్దు సమీపంలోని సొంత మామిడితోటలోని పనస చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ పరిశీలించారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతునికి ఐదు నెలల క్రితం వివాహమైంది. దీంతో మృతుని కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

భూ వివాదంలో ఇద్దరిపై దాడి


గాయపడిన సుధాకర్

నిమ్మనపల్లె : భూ వివాదం కారణంగా పొలం వద్ద జరిగిన ఘర్షణలో ఇద్దరిపై దాడి జరిగింది. బాధితులు తెలిపిన మేరకు వివరాలు.. తవళం పంచాయతీ చింతలవారిపల్లెకు చెందిన సుధాకర్(40), అతని తండ్రి మల్లప్ప(70) పొలంలో బుధవారం అధికారులు సర్వే చేస్తుండగా, మరో వర్గంలోని శ్రీరాములు, శ్రీనివాసులు వారితో గొడవపడ్డారు. ఘర్షణ ముదరడంతో శ్రీరాములు, శ్రీనివాసులుతో పాటు వారి కుటుంబ సభ్యులైన అనూరాధ, కళావతి, ఆదెమ్మ మూకుమ్మడిగా సుధాకర్, మల్లప్పపై దాడికి పాల్పడ్డారు. రాయితో దాడిచేయడంతో సుధాకర్ తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వెయ్యేళ్ల కాలిబాట!

అదివో.. అల్లదివో అంటూ శ్రీవారిని స్మరిస్తూ.. వేడుకొంటూ అత్యంత భక్తితో రాజంపేట మండలంలోని తాళ్లపాక వాసి పదకవితా పితామహుడు అన్నమాచార్యులు ఏడు కొండలను ఎక్కిన కాలిబాట అది. ఇది వెయ్యేళ్ల కిందటి మాట. ఆహ్లాదకరమైన దట్టమైన అటవీ మార్గంలో శ్రీవారిని దర్శించుకునేందుకు ఆ రోజుల్లో పూర్వీకులు వేల సంఖ్యలో వెళ్లేవారు. అన్నమయ్య వారసులు సైతం ఈ మార్గంలో కొండకు నడిచి వెళ్లారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో టీటీడీ అన్నమయ్య కాలిబాట అభివృద్ధికి నడుం బిగించింది. ప్రస్తుత ప్రభుత్వం అన్నమయ్య కాలిబాటను అటకెక్కించింది.

- నేటికీ అదే బాటలో వెంకన్న భక్తుల నడక
- కాలిబాట ఆద్యంతం ఆహ్లాదకరం, ఆధ్యాత్మికం
- కాలిబాట అభివృద్ధిని అటకెక్కించిన కూటమి ప్రభుత్వం

రాజంపేట : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిపై 32వేల కీర్తనలు రాసి ఆలపించి, మహాభక్తునిగా ప్రఖ్యాతి గాంచిన శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యులు తిరుమలకు నడిచి వెళ్లిన కాలిబాటలో వెళ్లడం మహాభాగ్యంగా శ్రీవారి భక్తులు భావిస్తున్నారు. ఆ కాలిబాటలో తిరుమల కొండకు చేరుకుంటున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఉన్నప్పుడు నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అప్పట్లో వైఎస్సార్ స్పందించి ఈ కాలిబాటను పరిశీలించాలని టీటీడీకి ఆదేశాలు కూడా జారీ చేశారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పాలకమండలి అన్నమయ్య కాలిబాట అభివృద్ధికి ఆమోదం తెలిపింది. ఆ దిశగా చర్యలు చేపట్టడంలో నిమగ్నమైన సంగతి తెలిసిందే. కూటమి సర్కారులో అన్నమయ్య కాలిబాటను అటకెక్కించేశారు. ఆ దిశగా చర్యలేవీ కనిపించలేదని భక్తులు ఆవేదన చెందుతున్నారు.


శేషాచలం అడవిలో అన్నమయ్య కాలిబాట

కాలిబాట స్వరూపం ఇలా..

- మామండూరు-బాలపల్లె మధ్య స్వామి పాదాల నుంచి తిరుమల కాలిబాట ప్రారంభమవుతుంది. పక్షుల కిలకిలలు, సెలయేళ్లు, ఆహ్లాదకరమైన వాతావరణం నడుమ కొండకు చేరుకోవచ్చు.
- అవ్వాతాత గుట్టలు, శుక్రవారం బండలు, పురాతన సత్రాలు, ఎర్రిగుంటలు, ఈతకాయల మండపం నుంచి గోగర్భతీర్థం(తిరుమల) చేరుకుంటారు.
- ఈ కాలిబాట సుమారు 14 కిలోమీటర్ల దూరం మేర పూర్తిగా దట్టమైన అడవిలో ఉంటుంది.
- పాదాలు, అక్కడి కోనేరు, సత్రాలు కాలగర్భంలో కలిసి పోయాయి.


108 అడుగుల అన్నమయ్య విగ్రహం

కాలిబాటకు వెయ్యేళ్లు..

రాజంపేట మండలంలోని తాళ్లపాక నుంచి అన్నమయ్య నడిచి వెళ్లిన కాలిబాట నేడు శిథిలమైంది. వెయ్యేళ్ల క్రితం ఉన్న రహదారి అభివృద్ధిపై తిరుమల తిరుపతి దేవస్థానం దృష్టి సారించింది. ఈ బాట ద్వారా వెయ్యేళ్ల క్రితం నుంచి భక్తులు గోవిందనామ స్మరణలు చేసుకుంటూ శ్రీవారి సన్నిధికి చేరుకుంటూనే ఉన్నారు.

అటవీప్రాంతం	శేషాచలం
తొలినడక	అన్నమాచార్యుడు
కాలిబాట ప్రారంభం	మామండూరు - బాలపల్లె మధ్య
చరిత్ర	వెయ్యేళ్లు
దూరం	23 కిలోమీటర్లు
అనుకూలం	ఉత్తర, దక్షిణ భారతీయులు, తెలంగాణ, రాయలసీమ వాసులకు

ఉత్తర, దక్షిణ భారతీయులకు అనుకూలం..

పూర్వం తిరుమలకు ఈ దారి గుండా అధిక సంఖ్యలో శ్రీవారి భక్తులు వెళ్లేవారు. అయితే తిరుపతి నుంచి ఏడుకొండలు మీదుగా తిరుమల చేరుకోవడం నేడు పరిపాటిగా మారింది. ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశంతోపాటు తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు చెందిన వారు తిరుపతికి వెళ్లకుండానే నేరుగా అన్నమయ్య కాలిబాట ద్వారా స్వామి సన్నిధికి చేరుకోగలరు. స్వామి సన్నిధికి చేరుకునే పుణ్య పవిత్రమైన మార్గంగా కాలిబాట ప్రాచుర్యం పెరుగుతోంది.

6న ఆకేపాటి పాదయాత్ర..

ఈనెల 6న శుక్రవారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి 22వ సారి వేలాది మందితో అన్నమయ్య కాలిబాటలో పాదయాత్ర చేపట్టి ఏడు కొండలు చేరుకోనున్నారు. ఈయనతోపాటు అనేక మంది గోవిందమాలలు ధరించి వెళ్లనున్నారు. ఉదయం ఆకేపాడు ఆలయాల సముదాయంలో శ్రీవారి కళ్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం 2 గంటలకు తిరుమల మహాపాదయాత్ర ప్రారంభవుతుంది.

అన్నమయ్య కాలిబాటలో నడిచి వెళ్లడం మహాభాగ్యం



పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు తిరుమలకు నడిచి వెళ్లిన కాలిబాటలో వెళ్లి శ్రీవారిని దర్శించుకోవడం మహాభాగ్యం. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడి ఆధ్వర్యంలో ఏటా భక్తులు కాలిబాటలో శ్రీవారిని దర్శించుకుంటున్నారు. కాలిబాట అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి.

- భూమన శివశంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, నాగిరెడ్డిపల్లె

మూడవ ఘాట్‌రోడ్డుగా అభివృద్ధి చేయాలి



అన్నమయ్య కాలిబాట అభివృద్ధిను అభివృద్ధి చేయాలని తన పాదయాత్రల ద్వారా విస్తృత ప్రచారం చేసి, అభివృద్ధికి టీటీడీ శ్రీకారం చుట్టేలా ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఎంతగానో కృషి చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హయాంలో అన్నమయ్య కాలిబాట అభివృద్ధి దిశగా అడుగులు వేశారు. ఈ కాలిబాటను అభివృద్ధి చేయడం వల్ల తిరుమల మూడవ ఘాట్‌రోడ్డుగా దోహదపడుతుంది.

-గడికోట వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు, రాజంపేట

విష ద్రావణం తాగి యువకుడి ఆత్మహత్య


ఉమామహేశ్వర్‌రెడ్డి (ఫైల్)

వల్లూరు (చెన్నూరు) : విష ద్రావణం తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సంగటి ఉమామహేశ్వర్ రెడ్డి (26) కారు డ్రైవర్‌గా అలాగే వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. బుధవారం తెల్లవారుజామున రోజువారి నడకలో భాగంగా బయటకు వెళ్లిన అతను పుష్పగిరి రోడ్డులోని గ్రామ సమీపంలో విషద్రావణం తాగాడు. సీఐ పురుషోత్తం రాజు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

పిడుగుపాటుకు గురై మహిళకు తీవ్ర గాయాలు

పెండ్లిమర్రి : మండలంలోని ఎనుగువారిపల్లె గ్రామానికి చెందిన పేర్ల నాగ పార్వతి (38) అనే మహిళ బుధవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడింది. స్థానికుల కథనం మేరకు.. నాగ పార్వతి రోజు మాదిరిగానే వ్యవసాయ పొలంలో పని చేస్తుండగా సాయంత్రం ఒక్క సారిగా వర్షంతో పాటు ఉరుములు మెరుపులు రావడంతో పిడుగు పడింది. దీంతో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

పాడి గేదె మృతి

కమలాపురం : మండల పరిధిలోని జంగంపల్లెలో పిడుగు పడి పాడి గేదె మృతి చెందింది. బుధవారం సాయంత్రం మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం కుస్తున్న సమయంలో భారీ శబ్దాలతో పిడుగు పడి జంగం పల్లెలో అనిమెల రాఘవకు చెందిన పాడి గేదె మృతి చెందింది.


ఆర్థిక సంబంధాలు బెడిసికొట్టడంతోనే వివాదం



మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల ధర్నా

మదనపల్లె : పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారిన ఎమ్మెల్యే, తహసీల్దార్ వ్యవహారంలో ఇద్దరి మధ్య ఆర్థిక సంబంధాలు బెడిసికొట్టడంతోనే అవినీతి ఆరోపణలు వెలుగు చూశాయని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి తోపు కృష్ణప్ప ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మండల తహసీల్దార్ ఖాజాబీని ఏరికోరి తెచ్చుకున్నారన్నారు. ఎమ్మెల్యేకు ఇవ్వాల్సిన మొత్తంలో ఏమన్నా తగ్గిందా అని ప్రశ్నించారు. మదనపల్లె మండల తహసీల్దార్ అవినీతిపై విచారణ జరిపి వాస్తవాలు ప్రజలకు చెప్పాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ స్వయంగా తన భూమిని మ్యుటేషన్ చేసేందుకు లక్ష రూపాయలు లంచం అడిగారని చెబుతున్నా జిల్లా కలెక్టర్ ఎందుకు చర్యలు తీసుకోలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చంద్రశేఖర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, తిరుమల, మురళి, మునికాటయ్య, నీలావతి, నిర్మల, గోపాల్, మల్లికార్జున, వెంకటేష్, కుమారి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సదాశివరెడ్డి

కలికిరి (వాల్మీకిపురం) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం వాల్మీకిపురం మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కూరపర్తికి చెందిన సదాశివరెడ్డి(53) మదనపల్లిలో నివాసం ఉంటున్నాడు. సొంత పని నిమిత్తం మంగళవారం రాత్రి స్వగ్రామానికి వచ్చి మదనపల్లికి ద్విచక్రవాహనంలో తిరుగుప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలో వాల్మీకిపురం సమీపంలోని సబ్‌జైలు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో సదాశివరెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో పోలీసులు వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

104 ఉద్యోగులపై ఎస్మా దుర్మార్గం


మాట్లాడుతున్న శ్రీనివాసులు

రాయచోటి అర్బన్ : వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని 104 సేవలను ఎస్మా పరిధిలోకి తీసుకువస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం దారుణమని సీపీఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అప్రజాస్వామికంగా ఇచ్చిన ఎస్మా ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వేతనాల బకాయిలు, పెండింగ్ బిల్లులు, 3 సంవత్సరాల ఇంక్రిమెంట్లు, పీఎఫ్ యాజమాన్య వాటా చెల్లింపు, స్లాబ్ ప్రకారం వేతనాల చెల్లింపు తదితర సమస్యలను పరిష్కరించాలని 104 ఉద్యోగులు వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి, ముఖ్యమంత్రికి పలు మార్లు విన్నవించినా ప్రయోజనం లేదన్నారు.

30 వేల హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్


మాట్లాడుతున్న జిల్లా సూక్ష్మసేద్య అధికారిణి లక్ష్మీప్రసన్న

మదనపల్లె : అన్నమయ్య జిల్లాలో 30వేల హెక్టార్లకు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను సబ్సిడీపై పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు జిల్లా సూక్ష్మసేద్య అధికారిణి లక్ష్మీప్రసన్న తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన ఉద్యానశాఖ, ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో కొత్తవారిపల్లె, దుబ్బిగానిపల్లె గ్రామసచివాలయాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్‌కు అర్హులైన ప్రతి ఒక రైతుకు.. 5 ఎకరాల కంటే తక్కువభూమి ఉంటే 90 శాతం రాయితీతో, ఐదెకరాల పైన ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను సరఫరా చేస్తామన్నారు. గతంలో సబ్సిడీపై డ్రిప్ పరికరాలు తీసుకుని ఉంటే, 7 సంవత్సరాల తర్వాత మళ్లీ సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. మండల వ్యవసాయాధికారి నాగప్రసాద్, ఉద్యానశాఖ అధికారి ఈశ్వరప్రసాదరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీసీ హరినారాయణ, ప్రకృతి వ్యవసాయ, ఆర్ఎస్‌కే సిబ్బంది చంద్రమౌళి, మానస, రైతులు పాల్గొన్నారు.

తెలుగు గంగ అధికారులపై లోకాయుక్తకు ఫిర్యాదు

మైదుకూరు : తెలుగు గంగ భూముల ఆక్రమణకు సహకరించిన ఆ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరినట్లు బీజేపీ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బీపీ ప్రతాప్‌రెడ్డి బుధవారం తెలిపారు. గతంలో తాను తెలుగు గంగ భూముల ఆక్రమణపై లోకాయుక్తకు ఫిర్యాదు చేశానన్నారు. ఆమేరకు జలవనరుల శాఖ ఈఎన్‌సీ తెలుగు గంగ ఇంజనీర్లను, భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఆదేశించిందని ఆయన పేర్కొన్నారు. అయితే సంబంధిత అధికారులు ఈఎన్‌సీ ఆదేశాలను ఖాతరు చేయలేదని తెలిపారు. భూముల ఆక్రమణకు సహకరించిన తెలుగుగంగ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికలు

పోలింగ్ వివరాలు		
పోలింగ్‌బూత్	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
నందలూరు	418	214
కడప	374	211
కోడూరు	256	107
ఎర్రగుంట్ల	473	222
కొండాపురం	200	109
ప్రొద్దుటూరు	144	117


కడప పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు వేచి ఉన్న కార్మికులు

రాజంపేట : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. డివిజనల్ ప్రిసైడింగ్ ఆఫీసర్ సుధాకర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ జయశంకర్ చౌహాన్‌లు పోలింగ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. డివిజన్ వ్యాప్తంగా 34 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఉమ్మడి జిల్లా పరిధిలో రైల్వేకోడూరు, నందలూరు, కడప, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, కొండాపురంలో పోలింగ్ కేంద్రాల్లో ఆయా పరిధిలో ఓటు కలిగిన ఉద్యోగ, కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రైల్వేరక్షక దళాలు, ప్రభుత్వ రైల్వే పోలీసులు, స్థానిక పోలీసులు పోలింగ్ బూత్‌ల వద్ద బందోబస్తును చేపట్టారు. డివిజన్ వ్యాప్తంగా 185 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కాగా డివిజన్ పరిధిలో 14, 453 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది.

6వతేదీలోపు పోస్టల్ బ్యాలెట్

వివిధ రైల్వే స్టేషన్‌లలో ఎన్నికల విధుల నిర్వహణలో ఉన్న సిబ్బందితోపాటు రన్నింగ్‌స్టాఫ్, టిక్కెట్ చెకింగ్, రక్షణ విభాగం సిబ్బంది ఈనెల 6వతేదీలోపు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు ఆదేశించారు. 6వతేదీ సాయంత్రంలోపు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాల్సి ఉంటుంది.

తొలిరోజు పోటాపోటీగా కార్మిక నేతల ఆరాటం

పోలింగ్ బూత్‌ల వద్ద తొలిరోజు వివిధ కార్మిక సంఘాల నేతలు తమకు అనుకూలంగా ఓటు అభ్యర్థన కోసం ఆరాటపడ్డారు. ప్రధానంగా మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్ కార్మిక సంఘాలు పోటీ పడుతున్నాయి.

నాటు బాంబుల కలకలం

పొలంలో 13 నాటు బాంబులు స్వాధీనం


నాటు బాంబు పేలి తీవ్రంగా గాయపడిన ఆవు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలం వేమిలేటికోట పంచాయతీ కొత్తపల్లె గ్రామానికి సమీపంలో నాటు బాంబుల కలకలం ఆందోళన కలిగిస్తోంది. పొలంలో మేత మేస్తున్న రెండు ఆవులు నాటు బాంబులను తినబోగా అవి పేలడంతో రెండింటికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనపై బుధవారం సీఐ రాజారెడ్డి, సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. కొత్తపల్లెకు తూర్పున కిలోమీటర్ దూరంలో సురేంద్ర అనే రైతు ఆవులను మేపుకుంటూ ఇంటికి తిరుగుముఖం పట్టాడు. దారిలో నడివీధివాల్ల గంగులప్ప భూమిలో ఒక ఆవు, తలారి శ్రీనివాసులు పొలంలో మరో ఆవు గడ్డి మేస్తూ ఉండగా అక్కడున్న బాంబులను నోటితో తినబోగా ఒక్కసారిగా పేలాయి. ఈ పేలుడు ధాటికి రెండు ఆవుల నోళ్లు ఛిద్రమయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో అల్లాడిపోయాయి. ఆ శబ్దానికి కొత్తపల్లె గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. గ్రామస్తులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకురావడంతో బుధవారం సీఐ రాజారెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పేలిన నాటు బాంబులు, పేలకుండా ఉన్న మరో 13 నాటు బాంబులను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని నీటి బక్కెట్టులో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, శివన్న అనే రైతు పొలంలో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నాడు. అడవి పందుల కారణంగా పంటలు నాశనం అవుతున్నాయని, వాటి బెడద నుంచి పంటను రక్షించుకునేందుకు నాటు బాంబులను పొలం గట్ల వద్ద పెట్టినట్టు ప్రాథమికంగా నిర్ధారించామని సీఐ రాజారెడ్డి మీడియాకు తెలిపారు. ఈ ఘటనపై వీఆర్‌ఓ శ్రీరాములు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, లారీ ఢీ

లారీ డ్రైవర్ మృతి


ప్రమాదంలో మృతి చెందిన లారీ డ్రైవర్ సిద్దప్ప

రాజంపేట : కడప-రేణిగుంట జాతీయ రహదారిలోని భువనగిరిపల్లె ఆర్చి(రాజంపేట మండలం) వద్ద బుధవారం తెల్లవారుజామున ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, లారీ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా దేవరపురి తాలూకా ఇబ్రహీంపట్నంకు చెందిన లారీ డ్రైవర్ పరమానంద సిద్దప్ప (35) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... తిరుపతి నుంచి హైదరాబాదుకు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు పట్టణ సరిహద్దులో ఉన్న భువనగిరిపల్లె ఆర్చి వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి, ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొంది. బస్సు డ్రైవర్ లోకేష్‌రెడ్డితోపాటు హైదరాబాదు చందానగర్‌కు చెందిన తనూజ, కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన ఎం.ప్రవీణ్, సునీల్‌కు గాయాలయ్యాయి. వీరిని రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. రోడ్డు ప్రమాదం సంఘటనతో హైవేలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు రంగప్రవేశంచేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదంపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.


ప్రైవేటు బస్సు, లారీ ఢీ కొన్న దృశ్యం


తల్లి చెంతకు పిల్లలు

సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో రెస్క్యూ ఆపరేషన్


తల్లి చెంతకు చేరిన పిల్లల్లో ఆనందోత్సాహం

రాజంపేట : ఎట్టకేలకు తల్లి చెంతకు పిల్లలు చేరుకున్నారు..ఇన్నాళ్లు తల్లిప్రేమకు దూరంగా ఉన్న వీరు తల్లి వద్దకు చేరగానే వారిలో పట్టలేని ఆనందం కనిపించింది. వివరాల్లోకి వెళితే.. నజ్మా అనే వివాహితను ఆమె భర్త చాలా ఏళ్ల క్రితం వదిలేసి వెళ్లాడు. వెళ్తూ పాఠశాలలో ఉన్న పిల్లలను కూడా తన వెంట తీసుకెళ్లడంతో ఆ తల్లి విలవిల్లాడిపోయింది. దీంతో సబ్‌కలెక్టర్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై సబ్ కలెక్టర్ వైఖోమ్‌నైదియాదేవి ప్రత్యేక దృష్టి సారించారు. ఆమె ఆధ్వర్యంలో డీఎస్పీ, సీఐ సహకారంతో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. మంగళవారం రంగంలోకి ప్రత్యేక బృందం దిగింది. ఇందులో పట్టణ పోలీసు స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ వై.హరినాథ్, కానిస్టేబుల్ ఏవీ రమణ, రాయచోటికి చెందిన వన్‌స్టాప్‌సెంటర్, కేస్‌వర్కర్ సాదకున్నీషా, జిల్లా బాలల సంరక్షణ విభాగం సామాజిక కార్యకర్త-1 ఏ.శైలజ ఉన్నారు. వీరు నజ్మా భర్త బెంగళూరులో ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లి బుధవారం పిల్లలను తీసుకొచ్చి తల్లికి అప్పగించారు.

బంగ్లాలో హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీ


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హిందూ ఐక్యవేదిక నాయకులు

రాయచోటి అర్బన్ : బంగ్లాదేశ్‌లో మైనార్టీ వర్గమైన హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం రాయచోటిలో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. నేతాజీ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద గజపతిరాజు మాట్లాడుతూ భారత రాష్ట్రపతి జోక్యం చేసుకుని బంగ్లాదేశ్‌లో హిందువులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డెయ్యరాజు, అయ్యప్ప సేవా సొసైటీ అధ్యక్షుడు బసిరెడ్డి స్వామి, మానవత లక్ష్మీకర్, బీజేపీ నాయకుడు శివగంగిరెడ్డి, ఆపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, హిందూ చైతన్య వేదిక జిల్లా సహ సంయోజక్ సగలా సుజన్ కుమార్ పాల్గొన్నారు.